సాక్షి విశాఖపట్నం

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



28,461 మందికి రైతు భరోసా

వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంలో జిల్లాకు చెందిన 28,461 మంది రైతులకు ఆర్థిక ప్రయోజనం కలిగింది. 8లో



విశాఖ చేరిన సీ295

భారత నౌకాదళానికి చెందిన బహుముఖ రవాణా విమానం సీ295 బుధవారం విశాఖపట్నానికి చేరుకుంది. 8లో



ఒత్తిడి జయిస్తే విజయం మీదే

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడిని జయించి మంచి మార్కులు సాధించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. 8లో

బినామీ సొమ్ము బాబు పాలు!

- జనసేనలో చక్రం తిప్పుతున్న ఇద్దరు నేతలు
- ఎంపీగా పోటీ చేస్తే ఎన్నికల ఖర్చంతా భరిస్తామని ఓ 'బాబు'కు హామీ
- రూ. 50 కోట్ల మేర భరించేందుకు సిద్ధమని వెల్లడి
- ఇదంతా ఓ కార్పొరేట్ కంపెనీ డైరెక్టర్ బినామీ సొమ్మని ప్రచారం



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

జనసేనకు చెందిన 'బాబు'ను ఎంపీగా బరిలో దింపేందుకు ఆ పార్టీలోని ఇద్దరు నేతలు చేస్తున్న హడావుడి వెనుక ఓ కార్పొరేట్ కంపెనీ డైరెక్టర్ బినామీ డబ్బుల గలగలలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఎంపీగా బరిలో నిలిస్తే అయ్యే మొత్తం ఖర్చును తామే భరిస్తామంటూ ఇద్దరు నేతలు సదరు బాబు ముందు ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా ఆ నేత కూడా ఎంపీగా బరిలో నిలిచేందుకు నియోజకవర్గంలో హడావుడి చేస్తున్నారు. ఎన్నికల ఖర్చు రూ.50 కోట్ల వరకు తాము భరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఇందుకు ప్రతిఫలంగా తమకు రెండు సీట్లు కావాలంటూ ప్రతిపాదించారు. ఇందుకు ఆ నేత కూడా ప్రాథమికంగా అంగీకరించినట్టు తెలిసింది. జనసేన అధినేతకు చెప్పి రెండు సీట్లు ఇప్పించే పూచీ నాదీ అని ఆ 'బాబు' కూడా హామీ ఇచ్చారని ఈ ఇద్దరూ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. పోర్టులో ఎగుమతి దిగుమతి వ్యాపారం చేసే వారికి తోడు తాజాగా పార్టీలో చేరిన మరో నేత కూడా జతకట్టారు. వీరంతా కలిసి సదరు బాబును ముగ్గులోకి దించి ముచ్చటగా తమ పని కానించుకుంటున్నట్టు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది.

బినామీగా ఉంటూ బిల్డప్!

వాస్తవానికి పెద్దగా ఆర్థికంగా బలంగా లేని సదరు నేతలు పార్టీలో ముఖ్యుల వద్ద చేస్తున్న హడావుడి చూసి పార్టీలోని ఇతర నేతలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఓ కార్పొరేట్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న వ్యక్తికి వీరిలో ఒకరు బినామీగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా పోర్టులో కాంట్రాక్టు పనిచేసే సదరు వ్యక్తితో కలిసి ఆ కంపెనీ డైరెక్టర్ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆయన ఈ నేత వద్ద భారీ మొత్తం బినామీగా ఉంచినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ మొత్తాన్ని చూపించే ఇప్పుడు ఎన్నికల వ్యయాన్ని భరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారని పార్టీలోని సీనియర్ నేతలు పేర్కొంటున్నారు. తాము ఫలానా కంపెనీకి బొగ్గును దిగుమతి చేశామని, రూ.100 కోట్ల బిల్లుల కోసం వెళుతున్నామంటూ 'బాబు' వద్ద హడావుడి చేసి బుట్టలో వేసుకున్నారని పార్టీలోని సీనియర్ నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. అంతేకాకుండా కొద్దిరోజుల క్రితం 'బాబు' ఇంట్లో జరిగిన పెళ్లికి కూడా రూ. 2 కోట్ల మేర నగదును ఇవ్వడంతో పాటు.. ఆ పెళ్లికి కార్పొరేట్ కంపెనీ డైరెక్టర్‌ను కూడా తమతో తీసుకెళ్లారని సమాచారం. వీరి బుట్టలో పడిన ఆ 'బాబు' రోజువారీ కార్యక్రమాలన్నీ వారు చెప్పినట్టే ఉంటున్నాయని సీనియర్లు వాపోతున్నారు. మరోవైపు పార్టీలో ప్రజల్లో బలం ఉన్న నేతలను కాదని... పైరవీకార్లకు ప్రాధాన్యత పెరుగుతోందని సీనియర్లు వాపోతున్నారు. పార్టీలో సీట్ల అమ్మకాలు జరిగిపోతున్నాయని జనసైనికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోర్టు వ్యాపారంలో ఉన్న మరో ఇద్దరు నేతలు కాస్తా... ఈ బినామీల వ్యవహారాన్ని ఆ కార్పొరేట్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు చెబుతున్నారు.

నాదెండ్ల పేరంటం!

- గూడెం సభకు పవన్ రమ్మన్నారు..
- జనసేన అసంతృప్తులకు ఫోన్లో పేరు పేరునా ఆహ్వానం
- అరకొర సీట్లపై అసహనంతో రగిలిపోతున్న శ్రేణులు
- ఉమ్మడి విశాఖ నుంచి అయిష్టంగానే వెళ్లిన కొందరు నేతలు



సాక్షి, విశాఖపట్నం: పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీ తమకు అరకొర సీట్లు కేటాయించడంపై జనసేన శ్రేణులు రగిలిపోతున్నారు. తమ అధినేత పవన్ కల్యాణ్ తీరుపై వీరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పైగా ఎప్పట్నుంచో పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారిని కాదని నిన్నగాక మొన్న చేరిన వారికే ప్రాధాన్యతనిస్తుండడం కూడా వీరికి రుచించడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన సీట్లను ఆశించి వైఎస్సార్‌సీపీ నుంచి జంప్ చేసిన నేతలకు బొటాబొటీ సీట్ల కేటాయింపు మింగుడు పడడం లేదు. దీంతో వారంతా నైరాశ్యంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేనలు సంయుక్తంగా పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో బుధవారం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సిద్ధం' సభలకు లక్షల్లో జనం పోటెత్తుతున్నారు. దీంతో టీడీపీ–జనసేనల పార్టీలకు గూడెం సభ ఎంతో ప్రతిష్టాత్మకంగా మారింది. పొత్తులో సీట్ల కేటాయింపునకు ముందు వరకు జనసేన శ్రేణులు ఒకింత ఉత్సాహంగా ఉండేవారు.

క్యాడర్‌లో నిరాశా నిస్పృహ

రాష్ట్ర వ్యాప్తంగా జనసేనకు టీడీపీ కేవలం 24 స్థానాలే కేటాయించడం, ఇటీవలే పార్టీలో చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు అనకాపల్లి సీటు ఖరారు చేయడం వంటి పరిణామాలతో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆశావహులతో పాటు క్యాడరు కూడా నిరాశా నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. మునుపటిలా కాకుండా పార్టీ కార్యాలయాలకు, కార్యకలాపాలకు వీరు దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితిని గుర్తెరిగిన జనసేన ముఖ్యనేతలు గూడెం సభకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఆశించినంతగా హాజరుకారన్న భావనకొచ్చారు.

పవన్ సార్ రమ్మన్నారు...

దీంతో పార్టీలో పవన్ తర్వాత స్థానంలో ఉన్న నాదెండ్ల మనోహర్‌ను రంగంలోకి దించారు. రెండ్రోజుల క్రితం నుంచి ఆయన ఇక్కడ కీలక నాయకులకు ఫోన్లు చేసి మరీ ఆహ్వానించారు. 'కల్యాణ్ సార్ మీకు ప్రత్యేకంగా చెప్పమన్నారు. మీతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ క్యాడర్‌ను కూడా తాడేపల్లిగూడెం సభకు తప్పకుండా తీసుకురండి.. మీ అందరూ వస్తేనే సభ సక్సెస్ అవుతుంది.. పార్టీలో ఇబ్బందులు, సీట్ల కేటాయింపు వంటి సమస్యలన్నీ నెమ్మదిగా పరిష్కారమవుతాయి..' అంటూ ఫోన్‌లో సముదాయించారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బొలిశెట్టి సత్యనారాయణ (సత్య), టి.శివశంకర్, మాజీ ఎమ్మెల్యే, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్, పీఏసీ సభ్యుడు కోన తాతారావు వంటి కొంతమంది నేతలు తాడేపల్లిగూడెం సభకు అయిష్టంగానే పయనమయ్యారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు నామమాత్రంగానే వెళ్లారు. చాలా మంది నాయకులు ఏదో వంక పెట్టి వెళ్లకుండా ఇక్కడే ఉండిపోయారు.

కాపుల కల సాకారం

- అర ఎకరంలో కాపు సామాజిక భవన నిర్మాణం
- ఎండాడ ప్రాంతంలో రూ.కోట్ల విలువైన స్థలం కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- నేడు భూమి పూజ చేయనున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స, గుడివాడ



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

విశాఖ సిటీ: తెలుగుదేశం హయాంలో కాపులపై దాడులు చేశారు. కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అదే కాపులపై కపట ప్రేమ చూపించారు. కాపు భవనానికి స్థలం కేటాయిస్తామంటూ కబుర్లు చెప్పి కాలక్షేపం చేశారు. గజం కూడా ఇవ్వకుండా చేతులెత్తేశారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాపులకు పెద్దపీట వేసింది. దీర్ఘకాలంగా ఉన్న జిల్లా కాపుల కలను సాకారం చేసే దిశగా అడుగులు వేసింది. కాపు సామాజిక భవనానికి రూ.కోట్లు విలువైన స్థలాన్ని కేటాయించింది. ఎండాడ జాతీయ రహదారికి ఆనుకుని దిశ పోలీస్‌స్టేషన్ పక్కన అర ఎకరం స్థలంలో కాపు సామాజిక భవన నిర్మాణానికి నేడు భూమి పూజ కూడా చేయనుంది.

టీడీపీ హయాంలో కబుర్లతో కాలక్షేపం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాపులను పూర్తిగా విస్మరించారు. కాపు రిజర్వేషన్ కోసం కొంత మంది కాపు నేతలు చేసిన ఉద్యమాలను అణిచివేయడానికి విశ్వప్రయత్నాలు చేశారు. కేసులు పెట్టి, కాపు నేతల ఇళ్లపై దాడులకు తెగబడ్డారు. భీమిలి ఎమ్మెల్యేగా గెలిచిన గంటా శ్రీనివాసరావు రాష్ట్ర మంత్రిగా కూడా వ్యవహరించారు. కానీ కాపులకు జరుగుతున్న అన్యాయంపై నోరెత్తలేదు. ఒక్కసారి కూడా కాపు సామాజిక భవన నిర్మాణంపై దృష్టి సారించలేదు. అయితే 2019 ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తెలుగుదేశం కాపులపై విపరీతమైన ప్రేమ కురిపించింది. కాపులకు రిజర్వేషన్, సామాజిక భవనానికి స్థలం కేటాయింపు ఇలా అనేక హామీలు గుప్పించింది. ఇందులో భాగంగా భీమిలి నియోజకవర్గంలో స్థలాన్ని కేటాయిస్తున్నట్లు అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా ప్రకటించారు. కానీ నెలలు గడిచినా ఆ విషయంపై దృష్టి పెట్టలేదు. గజం స్థలం కూడా కేటాయించలేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో పెద్దపీట

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు సంక్షేమానికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. కాపులకు రాజకీయ పదవుల్లో ప్రాధాన్యం కల్పించింది. దీర్ఘకాలంగా కాపులు కోరుతున్న సామాజిక భవన నిర్మాణానికి తాజాగా ప్రభుత్వం విలువైన స్థలాన్ని కేటాయించింది. ఎండాడ హైవేకు ఆనుకుని గజం రూ.1.5 లక్షలు విలువ చేసే అర ఎకరం స్థలాన్ని అందించింది. అంతేకాకుండా ఈ భవన నిర్మాణానికి గురువారం భూమి పూజ చేయనుంది. రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది.

ఈ ప్రభుత్వంలోనే కాపులకు మేలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే కాపులకు మేలు జరిగింది. కాపుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో కాపు సామాజిక వర్గానికి చెందిన గంటా శ్రీనివాసరావు మంత్రిగా ఉన్నప్పటికీ.. సామాజిక వర్గ సంక్షేమం కోసం నోరెత్తిన దాఖలాలు లేవు. కాపు సామాజిక భవన్‌కు స్థలం కేటాయింపుపై కనీసం దృష్టి సారించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పుడు రూ.కోట్లు విలువైన స్థలాన్ని కాపు భవన్‌ను కేటాయించింది. నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నాం.

– ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే

మళ్లీ టీడీపీ కపట ప్రేమ

ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబు మళ్లీ కాపు జపం చేస్తున్నారు. జనసేనతో పొత్తు పెట్టుకుని కాపులపై కపట ప్రేమను కురిపిస్తున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం వస్తేనే కాపులకు మేలు జరుగుతుందని మరోసారి కొత్త నాటకానికి తెరలేపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఆ సమయంలో ఎందుకు కాపు భవన్‌కు స్థలం కేటాయించలేదన్న ప్రశ్న.. ఆ సామాజికవర్గంలో ఇప్పుడు ఉత్పన్నమవుతోంది.

కాపులకు సీఎం జగన్ పెద్దపీట



టీడీపీ ప్రభుత్వం కాపులపై కేసులు పెట్టి హింసిస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. టీడీపీ కాపు నేతల ఇళ్లపై దాడులు చేయిస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాపులకు సామాజికంగా, రాజకీయంగా ప్రాధాన్యం కల్పించింది. గత ప్రభుత్వ హయాంలో కాపు భవన్‌కు స్థలమిస్తామని హామీ ఇచ్చి మోసం చేస్తే.. నేడు సీఎం జగన్ విలువైన స్థలాన్ని కాపు సామాజిక భవన్‌కు కేటాయించారు. ఇపుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చంద్రబాబు కాపులపై కపట ప్రేమ కురిపిస్తున్నారు. బాబు ఎన్ని నాటకలు ఆడినా.. కాపు సామాజికవర్గం విశ్వసించే పరిస్థితి లేదు.

– గుడివాడ అమర్‌నాథ్, మంత్రి

విశాఖ రచయితకు ప్రధాని మోదీ కితాబు



శ్రీధర్ బెవర

సాక్షి, విశాఖపట్నం : ప్రముఖ అంతర్జాతీయ మోటివేషన్ స్పీకర్, గోవా ప్రభుత్వ సలహాదారు, రచయిత, విశాఖకు చెందిన శ్రీధర్ బెవరని ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. సోమవారం నిర్వహించిన మన్ కీ బాత్‌లో శ్రీధర్ బెవర గురించి ప్రస్తావించిన మోదీ.. ఆయన ప్రయాణం.. భారత దేశ ప్రజలందరికీ ఆదర్శమని కొనియాడారు. పల్లెటూరిలో పుట్టి.. హోటల్‌లో వెయిటర్‌గా జీవనం సాగించిన శ్రీధర్.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి ఎదగడం వికసిత్ భారత్‌కు నిదర్శనమన్నారు. మోటివేషన్ స్పీకర్‌గా విద్యార్థుల జీవన ప్రయాణంలో ఎన్నో మార్పులు తీసుకొస్తున్నారని కొనియాడారు. శ్రీధర్ బెవర రచించిన మూమెంట్ సిగ్నల్, రోరింగ్ ల్యాంబ్స్ వంటి పుస్తకాలు గ్లోబల్ ఆడియన్స్‌ని మోటివేట్ చేస్తున్నాయని ప్రధాని అన్నారు. మోదీ ప్రశంసలపై శ్రీధర్ బెవరా స్పందిస్తూ.. భారత ప్రధాని నోట నా గురించి ప్రస్తావన రావడం నిజంగా అదృష్టమని అన్నారు. భవిష్యత్తులో మరింత మంచి రచనలు చేసేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. తాను రచించిన రోరింగ్ ల్యాంబ్ పుస్తకం అమెజాన్‌లో అత్యధికంగా అమ్ముడు పోయిన పుస్తకంగా అవార్డు గెలుచుకుందని తెలిపారు.

హాల్ టికెట్లు నిరాకరిస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: ఫీజు బకాయిలు, హాజరు సరిపడలేదన్న సాకుతో ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్లు నిరాకరించే కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం హెచ్చరించారు. ఈ అంశంపై ఇంటర్ బోర్డు అధికారులతో బుధవారం సమీక్షించారు. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల నిర్వాహకులకు దీనిపై తగిన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా నేరుగా హాల్ టికెట్లను జారీ చేస్తోందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలల యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తే.. apscpcr2018@gmail.comకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

7న వీఎంఆర్‌డీఏ షాపులకు వేలం

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏకు చెందిన షాపులు, ఆడిటోరియాలు, ఆఫీసులు, ఖాళీ స్థలాలను నెల/సంవత్సర అద్దె చెల్లింపు ప్రాతిపదికపై లీజుకు ఇచ్చేందుకు మార్చి 7న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ కార్యదర్శి కీర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్ www.vmrda.gov.in లోగానీ, కార్యాలయం 8వ అంతస్తులో రెవెన్యూ విభాగంలో గాని పొందవచ్చని సూచించారు. దరఖాస్తు, చలానా, డీడీలు ఈ నెల 29వ తేదీ నుంచి 6వ తేదీ సాయంత్రం 5 గంటలులోగా సమర్పించాలని వివరించారు. విస్తీర్ణం, వీఎంఆర్‌డీఏ అప్‌సెట్ ధర, ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

డిజిటల్ విద్యకు ప్రాధాన్యం

డీఈవో చంద్రకళ



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: జిల్లాలోని భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు డిజిటల్ విద్య బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. నగరంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో బుధవారం జిల్లాలోని భవిత కేంద్రాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొనేలా బోధన సాగించాలన్నారు. భవిత కేంద్రాలకు ట్యాబ్‌లను పంపిణీ చేసినందున వీటిపై అవగాహన పెంచుకొని, విద్యార్థులకు తోడ్పాటుగా నిలవాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు, ఏపీవో అప్పలనాయుడు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు

శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఆర్వో మోహన్ కుమార్

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించినా, ఉపేక్షించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఖర్చుల లెక్కింపు తదితర అంశాలపై ఎంసీసీ బృందాలు, ఏఈఆర్‌ఓలు, వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, పోలీసు అధికారులు, వీడియో, ఇతర సిబ్బందికి శిక్షణా కార్యక్రమం బుధవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో త్వరలో జరగనున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల నియమాలు, నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి అధికారి ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం నిర్లిప్తత ప్రదర్శించినా, ఎన్నికల కమిషన్ నుంచి కఠిన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఎన్నికల కమిషన్ కొత్తగా విడుదల చేసిన అంశాలపై ఎన్నికల సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, వ్యయానికి సంబంధించిన అంశాలపై ఆయా నోడల్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు 93 బృందాలు

సార్వత్రిక ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు, ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా వ్యాప్తంగా 93 రకాల బృందాలను నియమించినట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజవర్గ పరిధిలో ఏడేసి బృందాలు పనిచేస్తాయని.. వాటిలో ఎన్నికల వ్యయం, ఎంసీసీ అమలు, స్థూల, సూక్ష్మ స్థాయి పరిశీలనపరమైన అంశాలపై బృందాలు నిఘా ఉంచుతాయని తెలిపారు. బుధవారం తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించామని, రాజకీయ పార్టీలు, ప్రజల సహకారంతో ఎన్నికల ప్రక్రియను కూడా సమర్థంగా నిర్వహిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సలహాలు, సూచనలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న నాటికి జిల్లాలో ఓటర్లు సంఖ్య 19,62,440గా ఉందని స్పష్టం చేశారు. ఓటర్ల సంఖ్యను అనుసరించి జిల్లాలో 1941 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఓటర్ల సంఖ్య 1500 దాటితే ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో అనుబంధ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దీనికి సంబంధించి మార్చి 5వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొని కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

ఐపీఎల్ మ్యాచ్‌ల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీఏ, ఢిల్లీ క్యాపిటల్స్ సభ్యుల బృందం

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై ఢిల్లీ క్యాపిటల్స్ ఆపరేషన్స్ జట్టు సభ్యులు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డితో చర్చించారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తొలి రెండు మ్యాచ్‌లను హోమ్ గ్రౌండ్‌గా వైఎస్ఆర్ స్టేడియంలో ఆడనుంది. మార్చి 31న చెన్నై సూపర్ కింగ్స్‌తోను, ఏప్రిల్ 3న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడనుంది. ఈ సందర్భంగా మ్యాచ్‌ల నిర్వాహణ, స్టేడియంలో అఫిషియల్స్, ఆటగాళ్లకు కేటాయించే గదులు, కార్పొరేట్ బాక్సులు తదితర ఏర్పాట్లను పరిశీలించి ముందు జాగ్రత్తగా చేపట్టాల్సిన పనులను చర్చించారు. కార్యక్రమంలో ఏసీఏ సీఈవో ఎం.వి.శివారెడ్డి, సీఎఫ్ఓ నవీన్‌కుమార్, గేమ్ డెవలప్‌మెంట్ జీఎం ఎం.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టీఎల్ ట్రిడెంట్ ప్రారంభం



ట్రిడెంట్ వద్ద ఎన్ఎస్‌టీఎల్ అధికారులు

విశాఖ విద్య : ఎన్ఏడీ వద్ద గల ఎన్ఎస్‌టీఎల్ ప్రధాన గేటు ముందు నూతనంగా నిర్మించిన ట్రిడెంట్‌ను సంస్థ జీఎం డాక్టర్ వై.శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో తయారు చేసిన వివిధ రకాల పరికరాలతో ట్రిడెంట్‌ను తీర్చిదిద్దారు. పడవ ఆకారంలో ప్రత్యేక నిర్మాణం చేపట్టి, అక్కడ వివిధ సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేశారు. దీనిని ప్రతి ఒక్కరూ చూసేలా తగిన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రజానీకానికి అవగాహన కల్పించేలా దీనిని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం, సైంటిస్టు మధుకిరణ్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ హేమవతి పాల్గొన్నారు.

వారణాసికి కుర్తాళం పీఠాధిపతి పయనం



పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: శ్రీ లలితాపీఠం 75వ వార్షికోత్సవాల్లో పాల్గొన్న కుర్తాళం పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని బుధవారం వారణాసికి పయనమయ్యారు. వారణాసిలోని సిద్ధేశ్వరి పీఠంలో నెల రోజుల పాటు జరిగే వివిధ పూజా కార్యక్రమాల్లో స్వామీజీ పాల్గొంటారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. వార్షికోత్సవాల్లో సేవలందించిన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

టెట్‌కు 90.69 శాతం హాజరు

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్–2024) రెండో రోజు బుధవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని ఏడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి 4,333 మంది విద్యార్థులు పరీక్షకు నమోదు చేసుకోగా వీరిలో 3,930 మంది హాజరైనట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రాష్ట్ర పరిశీలకులు నాలుగు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఒక చోట, డీఈవో ఎల్ .చంద్రకళ ఒక కేంద్రాన్ని పరిశీలించారు.

డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణకు నేడు ఆఖరు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో వ్యాపారం చేసుకునే వారు డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్‌ను గురువారం సాయంత్రం 4 గంటల్లోపు పునరుద్ధరించుకోవాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సూచించారు. నిర్ణీత గడువు దాటిన తర్వాత డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ ఫీజుతో పాటు 25 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గడువులోగా లైసెన్స్ పునరుద్ధరించుకోని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీవీఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్ పొందకుండా వ్యాపారం నిర్వహించడం చట్టవిరుద్ధమన్నారు.

నేటి నుంచి రఘు కాలేజీలో అంతర్జాతీయ సదస్సు



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

టీచర్స్‌రోడ్డు: రఘు విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మార్చి 3వ తేదీ వరకు 3వ అంతర్జాతీయ వైర్‌లెస్, యాంటీనా మైక్రోవేవ్ సింపోజియం(వామ్స్ 2024) నిర్వహిస్తున్నట్లు సదస్సు జనరల్ చైర్ డాక్టర్ పి.ఎస్.ఆర్.చౌదరి తెలిపారు. రామ్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన సదస్సు వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఐఈఈఈ సౌజన్యంతో నిర్వహిస్తున్న సదస్సును జేఎన్‌టీయూ విజయనగరం ఉపకులపతి ఆచార్య కె.వెంకటసుబ్బయ్య ప్రారంభిస్తారని తెలిపారు. వర్తమాన పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలపై నిపుణులు ప్రసంగాలు ఉంటాయన్నారు. నూతన జ్ఞానాన్ని ఐదలాయింపు చేసుకోవడానికి, పరస్పరం పంచుకోవడానికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. సదస్సులో భాగంగా టెక్నికల్ సెషన్స్, కీలకోపన్యాసాలు, వర్క్‌షాప్‌లు, ప్రత్యేక సెషన్స్, స్టూడెంట్ పేపర్స్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్లీనరీ సెషన్స్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. రావ్ ఎస్ కన్సల్టెంట్స్(అమెరికా) నిర్వాహకుడు డాక్టర్ సుధాకరరావు మాట్లాడుతూ సదస్సులో 200 పరిశోధన పత్రాలను 300 మంది ప్రతినిధులు సమర్పిస్తారన్నారు. 43 అవార్డులను అందిస్తామన్నారు. నాసా జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ(అమెరికా) నిపుణులు డాక్టర్ నాసిర్ చాహత్, డాక్టర్ పావులో ఫోకార్డి, డాక్టర్ గౌరంగి గుప్తా ప్రసంగించారు.

మరికొంత కాలం తాత్కాలిక హాల్ట్‌లు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రయాణించే పలు రైళ్లకు ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన పలు తాత్కాలిక హాల్ట్‌లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం–లోకమాన్యతిలక్ టెర్మినస్–విశాఖపట్నం (18519/ 18520) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు కళ్యాణ్ స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది. విశాఖపట్నం–సాయినగర్ షిర్డీ–విశాఖపట్నం(18503/18504) ఎక్స్‌ప్రెస్‌కు కోపర్‌గావ్ స్టేషన్‌లో హాల్ట్ కొనసాగుతుంది.

ఒత్తిడి జయిస్తే విజయం మీదే..

- పరీక్షలకు సిద్ధమైన ఇంటర్ విద్యార్థులు
- రేపు ఫస్టియర్, మార్చి 2 నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభం

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం మొదటి సంవత్సరం, మార్చి 2వ తేదీ శనివారం నుంచి రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. జిల్లాలో 172 జూనియర్ కళాశాలల నుంచి జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి మొత్తం 82,766 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో బాలురు 43,493 మంది, బాలికలు 39,273 మంది ఉన్నారు. వీరి కోసం 93 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి.

ఆలయాల్లో పూజలు

శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కళాశాలల్లో హాల్ టికెట్లు తీసుకున్న విద్యార్థులు.. వాటితో నేరుగా ఆలయాలు, చర్చిలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని సంపత్ వినాయక ఆలయం వద్ద ఇంటర్ విద్యార్థుల కోలాహలం కనిపించింది. కొంత మంది తమ తల్లిదండ్రులతో ఆలయానికి వచ్చి గణనాథుడి పాదాల చెంత హాల్ టికెట్లు ఉంచి.. పరీక్షల్లో విజయం సాధించాలని వేడుకున్నారు.

ఒత్తిడి జయిస్తే విజయం తథ్యం

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. మెడిసిన్, ఇంజినీరింగ్‌తో పాటు పలు ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులు కొలమానంగా తీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ర్యాంకుల కోసం కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నారు. ఈ మొత్తం పరిణామాలతో ఇంటర్మీడియట్ పరీక్షలంటే.. విద్యార్థులకు ఎక్కడా లేని టెన్షన్ మొదలవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒత్తిడిని జయిస్తే విజయం తథ్యమని విద్యావేత్తలు, మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

ఇలా చేస్తే మేలు

- పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. నిమిషం ఆలస్యమైన పరీక్ష రాసేందుకు కేంద్రాల్లోకి అనుమతించరు. అందుకనే పరీక్ష కేంద్రానికి సరిగ్గా సమయానికి హడావిడిగా వెళ్లేకంటే.. ముందుగానే చేరుకుంటే మంచిది. కేంద్రాల్లోకి అరగంట ముందుగానే విద్యార్థులను అనుమతిస్తారు.
- ప్రశ్నాపత్రం ఇచ్చిన తర్వాత టెన్షన్‌కు గురికాకుండా.. దానిని అర్థం చేసుకునేందుకు కొంత సమయం తీసుకోవాలి. సబ్జెక్టుపై అవగాహనతోనే మంచి మార్కులు కైవసం చేసుకోవచ్చు. బాగా వచ్చిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాస్తే, కొంత టెన్షన్ తొలగుతుంది. ప్రశ్నలన్నింటికీ జవాబులు రాసేందుకు ప్రయత్నిం చేస్తే మంచి మార్కులు సాధించవచ్చు.

కేంద్రాలకు వీటిని తీసుకురావొద్దు

- పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు. వీటిని కేంద్రాల్లోకి అనుమతించరు. మాస్ కాపీయింగ్ వంటి చర్యలకు పాల్పడకూడదు.

ఆందోళన వీడాలి



పరీక్షల సమయంలో విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకూడదు. ప్రశాంత వాతారణంలో పరీక్ష రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు. ఏడాదంతా చదివిన సబ్జెక్టే అయినందున.. వాటిని గుర్తుకు తెచ్చుకుని రాసేందుకు ప్రయత్నించాలి. తల్లిదండ్రులు కూడా ఇంట్లో విద్యార్థులు చదువుకునేలా అనువైన వాతావరణం కల్పించాలి.

–డాక్టర్ రాజేశ్వరరావు, మానసిక వైద్య నిపుణులు

సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలి



పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశాం. ఫీజు బకాయిలతో సంబంధం లేకుండానే విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాలని ఆదేశించాం. ఈ విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి.

– పి.మురళీధర్, ఆర్ఐవో, విశాఖ జిల్లా

దివ్యాంగుల సమస్యలపై తక్షణమే స్పందిస్తాం

- సమస్యలుంటే ప్రతి నెలా 2, 15 తేదీల్లో మా దృష్టికి తీసుకురండి
- దిశ దివ్యాంగ సురక్ష యాప్‌ను వినియోగించుకోండి
- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ పిలుపు

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధుల పాఠశాలను నగర పోలీస్ కమిషనర్ డా. ఎ.రవి శంకర్ బుధవారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదుల్లో సౌకర్యాలు, సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దిశ యాప్‌కు కొనసాగింపుగా దిశ దివ్యాంగ సురక్ష యాప్‌పై ఇక్కడ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. దివ్యాంగులు ఆపదలో ఉన్నప్పుడు దివ్యాంగ సురక్ష టోల్ ఫ్రీ నంబర్ 73374 34422 ద్వారా వీడియో కాల్ లేదా వీడియో సందేశంతో పోలీసులకు సమాచారం అందించవచ్చన్నారు. దివ్యాంగుల సమస్యలు చెప్పుకునేందుకు ప్రతి నెలా 2, 15 తేదీల్లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 73374 34422లో సైన్ లాంగ్వేజ్ నిపుణురాలిని అందుబాటులో ఉంచుతామని, దివ్యాంగుల సమస్యలపై తక్షణమే స్పందిస్తామని తెలిపారు. పలువురు పోలీసులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చే నెల 7న అనకాపల్లి రానున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. బుధవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పిసినికాడ గ్రామాన్ని సందర్శించి బహిరంగ సభ ఏర్పాట్ల గురించి చర్చించారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన చేశారు. ముఖ్యమంత్రి 7న వైఎస్సార్ చేయూత చివరి విడత నిధులు విడుదల చేయనున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్, ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- అనుమానంతో సహజీవనం చేసిన వ్యక్తే చంపేశాడు
- తిమ్మాపురంలో ఘటన



రామతల్లి మృతదేహం



కోనాడ రామతల్లి (ఫైల్) నిందితుడు దేముడు

కొమ్మాది: సహజీవనం సాగిస్తున్న వ్యక్తే ఆ మహిళ పాలిట కాలయముడయ్యాడు. అనుమానంతో ఆమెను హత్య చేశాడు. భీమిలి బీచ్ రోడ్డులో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివీ.. రామతల్లి, నూకరాజు భార్యాభర్తలు. వీరు గతంలో అప్పుఘర్‌లో నివసించేవారు. వీరికి ఇద్దరు సంతానం. కుమార్తె ధనకు వివాహం కాగా.. కుమారుడు ధనరాజు ఆటోడ్రైవర్. నాలుగేళ్ల కిందట నూకరాజు అనారోగ్యంతో మరణించాడు. ఆ తర్వాత అదే ప్రాంతానికి చెందిన గరికిన దేవుడు అనే వ్యక్తితో రామతల్లికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధంగా మారింది. దీంతో పిల్లలకు దూరంగా ఉండాలని వీరు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ 4వ వార్డు చేపల తిమ్మాపురంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం చేయడం ప్రారంభించారు. దేవుడు సిమెంట్ పని చేస్తుండగా.. రామతల్లి రుషికొండలోని ఓ కళాశాలలో హౌస్‌కీపర్. ఇటీవల కాలంలో వీరిద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయి. దేవుడు ఎప్పుడు ఫోన్ చేసినా రామతల్లి ఫోన్ బిజీగా ఉండేది. దీంతో ఎవరితో మాట్లాడుతున్నావని ఆమెను అనుమానించేవాడని స్థానికులు తెలిపారు. ఈ కారణంగా ప్రతి రోజూ వీరి మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మాటామాటా పెరిగి గొడవ పెద్దదైంది. దీంతో ఆగ్రహం పెంచుకున్న దేవుడు బుధవారం తెల్లవారుజామున రామతల్లి నిద్రిస్తుండగా మెడకు తాడు చుట్టి హత్య చేశాడు.

పోలీసులకు లొంగిపోయిన నిందితుడు

రామతల్లిని హత్య చేసిన దేవుడు బుధవారం ఉదయం భీమిలి పోలీసులకు లొంగిపోయాడు. తానే హత్య చేశానని ఒప్పుకోవడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ఏసీపీ బి.సునీల్, సీఐ డి.రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాత్రంతా డైరెక్టర్ చాంబర్‌లోనే నిరసన

ఉక్కు సీఎండీ చర్చలు.. ఫలితం శూన్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు తమ డిమాండ్ల సాధన కోసం మంగళవారం రాత్రంతా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ చాంబర్‌లో ఉండి నిరసన తెలిపారు. బుధవారం మధ్యాహ్నం సీఎండీ ఆధ్వర్యంలో చర్చలు జరిగినా ఎటువంటి ప్రయోజనం లేకపోయింది. కార్మిక సంఘాల విజ్ఞప్తిని పట్టించుకోకుండా ఉక్కు యాజమాన్యం ప్లాంట్‌లో బయోమెట్రిక్ అమలు కోసం జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం ఆందోళనకు దారి తీశాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి.పాండే చాంబర్‌కు వెళ్లిన నాయకులు ఆయన్ని చాంబర్ దాటి వెళ్లకుండా ముట్టడించారు. యాజమాన్యం నుంచి ఎటువంటి సానుకూల స్పందన రాకపోవడంతో నాయకులు అర్ధరాత్రి వరకు అక్కడే బైఠాయించారు. ఆ తర్వాత అక్కడే నిద్రపోగా.. డైరెక్టర్ పాండే కూడా కుర్చీలోనే నిద్రించారు. బుధవారం కూడా నిరసన కొనసాగడంతో ఢిల్లీ నుంచి వచ్చిన సీఎండీ అతుల్ భట్ నాయకులను హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌కు ఆహ్వానించారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు నాలుగు గంటల పాటు చర్చలు సాగినా.. ఎటువంటి ఫలితం లేకపోయింది. లాభాలు వస్తే తప్ప వేతన సవరణ చేయలేమని సీఎండీ నాయకులకు తేల్చి చెప్పారు. బయోమెట్రిక్‌లో మార్పులు, చేర్పుల కోసం కమిటీ ఏర్పాటుకు అంగీకరించిన యాజమాన్యం.. అంతవరకు బయోమెట్రిక్ ఉత్తర్వుల ఉపసంహరణ, వాయిదాకు నిరాకరించింది. దీంతో కథ మొదటికి వచ్చింది. ఈలోగా సీఎండీ వేరే సమావేశం ఉందని వెళ్లడంతో చర్చలు వాయిదా పడ్డాయి. ఉక్కు అడ్మిన్ వద్ద ఎన్నో ఆశలు పెట్టుకున్న యువ ఉద్యోగులు ఈ విషయం తెలిసి ఆగ్రహంతో హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌కు తరలివెళ్లారు. రెండు రోజుల పాటు నిరసన తెలిపిన సంఘ నాయకులు.. ఏమీ సాధించలేకపోయారని కార్మికులు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఉక్కు హిల్‌టాప్ గెస్ట్ హౌస్‌లో కార్మిక నాయకులతో సమావేశమైన సీఎండీ, అధికారులు

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



సాయికుమార్(ఫైల్)

పీఎంపాలెం: చదువుకోవాల్సిన వయసులో దురలవాట్లకు బానిసైన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్మకు పాల్పడి.. కన్నవారికి కడుపు కోత మిగిల్చాడు. బుధవారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పీఎంపాలెం సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం దారపువానిపేటకు చెందిన దారపు అప్పారావు నగరానికి వలస వచ్చాడు. జీవీఎంసీ 7వ వార్డులోని వాంబేకాలనీ జీఎఫ్–6 లో కుటుంబంతో కలసి నివసిస్తున్నాడు. అతని కుమారుడు సాయికుమార్(17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చదువు మీద ఆసక్తి లేకపోవడంతో సుమారు రెండు నెలల నుంచి అతను కళాశాలకు వెళ్లడం లేదు. మద్యం సేవించడం, ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం తదితర చెడు అలవాట్లకు బానిసయ్యాడు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా.. ఈ నెల 27న కుమారుడిని ఇంటి వద్దనే ఉంచి అప్పారావు తన స్వగ్రామంలో జరుగుతున్న ఇంటి నిర్మాణం పనులు చూసేందుకు భార్యతో కలసి వెళ్లాడు. జీవితం మీద విరక్తి చెందిన సాయికుమార్ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు.. అప్పారావుకు ఫోన్‌లో తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

28,461 మందికి రూ.5.70 కోట్ల రైతు భరోసా

వైఎస్సార్ సున్నావడ్డీ కింద రూ.32.51 లక్షల విడుదల



రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలకు సంబంధించి నమూనా చెక్కులను అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, వ్యవసాయ అధికారి అప్పలస్వామి

మహారాణిపేట: వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంలో జిల్లాకు చెందిన 28,461 మంది రైతులకు ఆర్థిక ప్రయోజనం కలిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 5వ ఏట మూడో విడత నిధులను విడుదల చేశారు. పథకంలో భాగంగా జిల్లాకు చెందిన రైతుల ఖాతాల్లో రూ.5.70 కోట్ల నిధులను జమ చేశారు. అలాగే వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాల కింద రూ.32.51 లక్షలను సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో జరిగింది. జిల్లాకు చెందిన రైతులు, ఇతర అధికారులతో పాటు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలకు సంబంధించిన నమూనా చెక్కులను కలెక్టర్, ఇతర అధికారులు రైతులకు అందజేశారు. వ్యవసాయశాఖ అధికారి అప్పలస్వామి, ఉద్యాన శాఖ అధికారి మన్మథరావు పాల్గొన్నారు.

విశాఖ చేరిన సీ295



స్వాగతం పలుకుతున్న అధికారులు

విశాఖ విద్య: భారత నౌకాదళానికి చెందిన బహుముఖ రవాణా విమానం సీ295 బుధవారం విశాఖపట్నానికి చేరుకుంది. ఈఎన్‌సీకి చెందిన ఐఎన్ఎస్ డేగాకు తొలిసారిగా ఈ విమానం రావడంతో తూర్పు నావికాదళం అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అత్యవసర సమయంలో.. దేశంలో అంతర్గత రవాణా వ్యవస్థ బలోపేతం చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విమానం రాక పట్ల నౌకాదళ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

యువతిని రక్షించిన పోలీసులు

అల్లిపురం: ఆత్మహత్య చేసుకునేందుకు ఆర్.కె.బీచ్‌కు వచ్చిన యువతిని నగర పోలీసులు రక్షించారు. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన సరిపల్లి రమ్య ఇంట్లో గొడవపడి చనిపోదామని నేరుగా ఆర్.కె.బీచ్‌కు వచ్చింది. ఆమె కదలికలపై అనుమానం రావడంతో అబిష్ అనే వ్యక్తి రాత్రి 10.35 సమయంలో డయల్ 112కు ఫోన్ చేసి.. ఓ అమ్మాయి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని సమాచారం అందించాడు. కంట్రోల్ రూం నుంచి 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం రావడంతో... దిశా మొబైల్, ఆర్.కె.బీచ్ టూరిస్టు పోలీస్ స్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

టూరిస్ట్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కేబీపీ కిశోర్, దిశ మొబైల్ డ్రైవర్ నారాయణరావు బీచ్‌లో గాలించారు. వారికి అమ్మాయి కనిపించడంతో ప్రశ్నించి.. మూడో పట్టణపోలీస్ స్టేషన్‌కు తరలించారు. కౌన్సెలింగ్ ఇచ్చి.. ఆమె అన్నయ్య భానుప్రసాద్‌ను పిలిపించి అప్పగించారు. సమాచారం ఇచ్చిన యువకుడిని, సకాలంలో బాధితురాలిని గుర్తించి, ఆత్మహత్యకు పాల్పడకుండా కాపాడిన పోలీస్ సిబ్బందిని సీపీ రవిశంకర్ అభినందించారు.